క్లుప్తంగా

ఉత్తమ అంగన్‌వాడీగా రాణి



స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రానికి చెందిన ఘన్‌పూర్–6వ సెంటర్ అంగన్‌వాడీ టీచర్ మునిగాల రాణి మహిళా దినోత్సవం సందర్భంగా ప్రకటించిన రాష్ట్రస్థాయి ఉత్తమ అంగన్‌వాడీ టీచర్ అవార్డును గురువారం అందుకున్నారు. ఈ మేరకు హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో మహిళా సంక్షేమ శాఖ కమిషనర్ వాకాటి కరుణ, కమిషనర్ క్రాంతివెస్లీ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్‌గా తాను చేస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డును అందించారని తెలిపారు. పదేళ్ల క్రితం రాష్ట్రస్థాయిలో బెస్ట్ అవార్డు వచ్చిందని, ప్రస్తుతం రెండో సారి అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. అవార్డుతో తన బాధ్యత మరింతగా పెరిగిందని, అంగన్‌వాడీ టీచర్‌గా మరింత బాధ్యతగా, చిత్తశుద్ధితో పనిచేస్తానన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

రఘునాథపల్లి: మండలంలోని కంచనపల్లికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ ఎంపీటీసీ కేమిడి రమ్యరాజుతో పాటు పలువురు గురువారం స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ముందుగా గ్రామంలోని బీరప్ప కురుమసంఘం కమ్యూనిటీ భవనం కోసం నిధులు మంజూరు చేయగా స్లాబ్ నిర్మాణ పనులను ఇందిర ప్రారంభించారు. ఈసందర్భంగా కోడూరు గ్రామం నుంచి లింగాలఘణపురం మండలంలోని చీటూరు గ్రామం వరకు లింక్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మధన్‌మోహన్, అంజమ్మ, చంద్రయ్య, పరుశరాములు, బండ అనీల్ ఇందిరకు వినతి పత్రం అందజేశారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్ చందర్‌రెడ్డి, ఎంపీపీ మేకల వరలక్ష్మి, నరేందర్, రవి, రమేష్, ఈశ్వరయ్య, నరేందర్‌రెడ్డి, పురుషోత్తం పాల్గొన్నారు.

జఫర్‌గఢ్: మండలంలోని రేగడితండా గ్రామ శివారు టీబీతండాకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, ఉప సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు లకావత్ దేవేందర్‌నాయక్ తన అనుచరులతో కలసి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర సమక్షంలో స్టేషన్‌ఘన్‌పూర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం కాంగ్రెస్‌లో చేరారు. వీరికి ఇందిర కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు అన్నెబోయిన భిక్షపతి, మంచాల ఎల్లయ్య, చిట్టిమళ్ల కృష్ణమూర్తి, ముక్తార్‌అలీ, లచ్చిరాం నాయక్, కీమానాయక్, శివరాజు, సురేందర్, యాకుబ్, రాజు, రవీందర్ పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

పాలకుర్తి టౌన్: మండలానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు మండల అధ్యక్షుడు దుంపలి సంపత్ ఆధ్వర్యంలో బీజేపీలో గురువారం చేరారు. కాగా, వీరికి జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీలో చేరిన వారిలో కమ్మగాని నాగేశ్, సలేంద్ర రామన్న, కన్నా సోమసత్తి, చిలుకమారి వెంకన్న, వల్మిడి ఆలయం మాజీ డైరెక్టర్ పిట్టల సైదులు, గుగ్గిళ్ల ముకుద్దం ఉన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సొడ రమేష్, కర్ర శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.

నివాళి

బచ్చన్నపేట : అమరుల పోరాట స్ఫూర్తితో ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని తమ్మడపల్లి గ్రామంలో సీపీఎం పార్టీ నాయకులు, ఆ పార్టీ మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేష్ తండ్రి బెల్లంకొండ సుధాకర్ సంస్మరణ సభ మిన్నాలపురం ఎల్లయ్య అధ్యక్షతన జరిగింది. ముందుగా ఆయన చిత్రపటానికి పూల మాలలను వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ మృతుడు సుధాకర్ గత 50 సంవత్సరాలు పార్టీ జెండాను మోస్తూ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పని చేశాడని కొనియాడారు. విజేందర్, గోపి, గణేష్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ



చిల్పూరు: మండలంలోని మల్కాపూర్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని మాజీ వార్డు సభ్యులు ఊరడి సతీష్, పసుల వెంకటేశ్వర్లు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలని కోరారు.

కొడకండ్ల: మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు మహాత్మా హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు, ఎంపీవో గంట రవీందర్ అందించిన పరీక్ష కిట్లను గురువారం పాఠశాల సిబ్బంది పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతి కోసం గంట రవిందర్ ఏనలేని కృషి చేస్తున్నాడని, పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లతో పాటు కిట్లను అందించడం అభినందనీయమని మండల నోడల్ ఆఫీసర్ గ్రేస్‌కెజియా రాణి అన్నారు.

ఎండిన పంటలకు పరిహారం చెల్లించాలి



లింగాలఘణపురం: మంథోనిగూడెంలో ఎండిన పంటను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

లింగాలఘణపురం: ఆరుగాలం కష్టపడి చేతికొచ్చే దశలో సాగునీరు లేక ఎండిపోయిన వరి పంటలకు ప్రభుత్వం ఎకరానికి రూ.40వేల పరిహారం చెల్లించాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆది సాయన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని కళ్లెం, మాణిక్యాపురం, మంథోనిగూడెం తదితర గ్రామాల్లో ఎండిన వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు వెంటనే ఎండిన పంటలను పరిశీలించి పరిహారం అందే విధంగా చూడాలని కోరారు. ఆయనతో పాటు నాయకులు సోమయ్య, మధు, వెంకటాద్రి, రోశయ్య ఉన్నారు.

సాగునీరు అందించాలి..

మండలంలో ఎండిపోతున్న పంటలకు సాగునీరు అందించాలని సీపీఐ మండల కార్యదర్శి సదానందం డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని కుందారంలో ఎండిన పంటలను సీపీఐ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండిన పంటలకు వెంటనే పరిహారం అందించాలన్నారు. ఆయనతో పాటు నాయకులు యాకన్న, నాగరాజు, యాదగిరి, సాయికుమార్, శేఖర్, సురేశ్, యాదయ్య, లక్ష్మీనారాయణ, సతీష్, జహింగీర్ తదితరులు పాల్గొన్నారు.

బచ్చన్నపేట: మండలంలోని పలు గ్రామాల్లో వరి పంటలు ఎండుతుంటే అధికార పార్టీ నాయకులు విమర్శలు చేస్తూ పరిహాసమాడుతున్నారని బీఆర్‌ఎస్ పార్టీ యూత్ మండల అధ్యక్షుడు వడ్డెపల్లి ఉపేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో మాట్లాడుతూ గత 9 సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం వేసవి కాలంలో పంటలకు సాగునీరు మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అందించారని అన్నారు. నీటిని విడుదల చేసే సమయంలో అధికారులతో గొడవలు, కేసులయ్యానాయని అన్నారు. రైతుల సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఎండిన పంటలకు నష్టపరిహారం ఇవ్వాలన్నారు.

అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం



స్వామివారికి కలశాలను తీసుకెళ్తున్న భక్తులు



అలంకరణలో స్వామి

జనగామ: జిల్లా కేంద్రం శ్రీరాంనగర్ కాలనీ మూల బావి హనుమత్ రామనాథ సహిత సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో గురువారం ఆలయ నాల్గో వార్షికోత్సవ వేడుకలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు డాక్టర్ మోహనకృష్ణ భార్గవ మంత్రోచ్చారణ నడుమ గణపతి పూజ, పుణ్యవచనం, నవగ్రహారాధన, నవ కలశ స్థాపన, కలశారాధన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అభయాంజనేయ స్వామి వారికి నవ కలశాలు, ఫలరసాలు, పంచామృతాలు, హరిద్రా కుంకుమ సింధూర గంధాదులు, పలు సుగంధ ద్రవ్యాలతో పూర్ణ కలశ కుంభాభిషేకం చేశారు. అనంతరం అర్చకులు స్వామి వారికి విశేష అలంకరణ జరిపారు. నాలుగు సంవత్సరాల కాలంలో ఎన్నో ప్రతిష్టాత్మకమైన ఉత్సవాలను వైభవోపేతంగా నిర్వహించినట్లు, ఆ ఘనత అర్చకులు, కమిటీ సభ్యులకు దక్కుతుందన్నారు. ఈ పూజా కార్యక్రమాల్లో ఝిలసాని కృష్ణమూర్తి, రాంబాబు, కందాడి మల్లారెడ్డి, జక్కా నర్సిరెడ్డి, ఉపేందర్‌రెడ్డి, పాశం శ్రీశైలం, కొౖరెముల రాంప్రసాద్, కల్పెం నాగరాజు, సంజీవ్ రెడ్డి, తూముకుంట్ల ఉమాకర్, రవి, అభిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణంపై దర్యాప్తు చేయాలని ఫిర్యాదు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న రాజారెడ్డి

జనగామ: లింగాలఘనపురం నెల్లుట్ల పరిధిలోని శిఖం భూమికి సంబంధించి కోర్టులో కేసు కొనసాగుతుండగా ప్రభుత్వ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం చేసిన అధికారులపై చర్యలు తీసుకుని, సమగ్ర దర్యాప్తు చేయాలని మాజీ ఎమ్మెల్యే, సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ రాజారెడ్డి అన్నారు. ఇందుకు సంబంధించి గురువారం కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాషాకు ఆయన ఫిర్యాదు చేశారు. అనంతరం మాట్లాడుతూ శిఖం భూమి విషయంలో హైకోర్టులో వాదనలు జరుగుతున్న సంగతి తెలిసి రోడ్డు వేయడం ఏంటన్నారు. ఈ భూమి ఏడాదిలో 12 నెలల పాటు నీటిలో మునిగి ఉంటుందని తప్పుడు డిక్లరేషన్‌తో ఓ భూస్వామి కాజేశారని ఆరోపించారు. డబ్బులకు ఆశపడి కొంతమంది అధికారులు భూస్వామికి మద్దతుగా నిలిచారన్నారు. ఈ భూమి వివాదంపై ఉమ్మడి జిల్లాలో గతంలో పనిచేసిన కలెక్టర్ రాహుల్ బొజ్జా ప్రభుత్వ స్థలాన్ని కాపాడేందుకు హైకోర్టులో కేసువేసి కొట్లాడుతున్నారని తెలిపారు. కోర్టులో ఉన్న భూమిలో సీసీ రోడ్డు వేయరాదని ఇటీవల జనగామ నుంచి బదిలీపై వెళ్లిన కలెక్టర్ శివలింగయ్యకు ఆరు నెలల క్రితం సమాచారం అందించినా రూ.40 లక్షల ప్రజా ధనం ఖర్చు చేశారన్నారు. కోర్టు పరిధిలో ఉన్నప్పటికీ, ఇంతటి సాహసానికి ఒడిగట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భూమిలో రోడ్డు వేసేందుకు అనుమతులు ఇచ్చిన అధికారుల నుంచి రూ.40 లక్షలను రికవరీ చేయాలన్నారు. ఆయన వెంట జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న, ఎ.శ్రీనివాస్, మాజీ జిల్లా కౌన్సిలర్ ఎండీ దస్తగిరి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మంగళంపల్లి జనార్దన్, పట్టణ కార్యదర్శి సొప్పరి సోమయ్య, సీహెచ్ మల్లేశం, మధు, వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



నర్మెట: సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ముదిరాజ్‌లు

నర్మెట: ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటును స్వాగతిస్తూ మండల అధ్యక్షుడు వంగాల గోవర్దన్ ఆధ్వర్యంలో మండలంలోని ముదిరాజ్ సంఘం నాయకులు గురువారం నర్మెట చౌరస్తాలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి గంగం నర్సింహారెడ్డి, మాజీ జెడ్పీటీసీ గాదె మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రాజబోయిన లక్ష్మీనారాయణ, ఓబీసీ సెల్ అధ్యక్షుడు బండి అశోక్, టౌన్ అధ్యక్షుడు శ్రీధర్, ఎఫ్‌సీఎస్ అధ్యక్షుడు ఉపేందర్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో..

జఫర్‌గఢ్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఆర్యవైశ్య భవనంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సంఘం రాష్ట్ర నాయకులు చిట్టిమళ్ల కృష్ణమూర్తి, రేవూరి రమేష్, బోనగిరి శ్రవణ్‌కుమార్, బజ్జూరి మణికాంత్, గందె సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

కృతజ్ఞతలు

జనగామ: రాష్ట్రంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించిన సీఎం రేవంతద్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వంతో పాటు విప్ బీర్ల ఐలయ్యకు ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, ఆర్యవైశ్య జాతీయ నాయకులు డాక్టర్ వంగ పల్లి అంజయ్య స్వామి కృతజ్ఞతలు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్య కులంలో పేద, మధ్యతరగతి కుటుంబాల ఆశయాలను గౌరవించారన్నారు. గత ప్రభుత్వాలు ఆర్యవైశ్య నాయకులను మభ్యపెడుతూ, తమ కుటుంలోని పేదలకు మాత్రం ఒరగబెట్టింది ఏమీ లేదన్నారు. ఆర్యవైశ్య కార్పొరేషన్‌కు నిధులు మంజూరు చేసి, అభివృద్ధికి బాటలు వేయాలని విజ్ఞప్తి చేశారు.

హర్షణీయం

చిల్పూరు: ఆర్యవైశ్యుల చిరకాల వాంఛ అయిన తెలంగాణలో ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు సర్వత్రా హర్షణీయమని మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మంతెన లవకుమార్‌గుప్తా అన్నారు. ఈ మేరకు హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని సీఎం నివాసంలో ఆర్యవైశ్య మహిళా నాయకురాలు సుజాతగుప్తా ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయడంపై కృతజ్ఞతలు తెలిపారు.

కడియం కావ్యను కలిసిన కృష్ణమూర్తి



స్టేషన్‌ఘన్‌పూర్: వరంగల్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్యను డివిజన్ కేంద్రానికి చెందిన అభ్యుదయ యువజన సంఘం నియోజకవర్గ కన్వీనర్ పోశాల కృష్ణమూర్తి గురువారం హనుమకొండలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కడియం కావ్యకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డాక్టర్‌గా, కడియం ఫౌండేషన్ చైర్‌పర్సన్‌గా డాక్టర్ కావ్య పలు సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజల అభిమానాన్ని చూరగొందన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరండి

జనగామ రూరల్: అన్ని రకాల వసతులు ఉన్న జనగామ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో విద్యార్థులు చేరాలని కళాశాల ప్రిన్సిపాల్ నర్సయ్య అన్నారు. కళాశాల అడ్మిషన్ల బ్రోచర్‌ను అధ్యాపకులతో కలిసి ఇంటర్ పరీక్షలు రాసిన విద్యార్థులకు గురువారం అందజేశారు. తమ కళాశాలలో అన్ని రకాల వసతులు ఉన్నాయని 26వేల పుస్తకాలు గల లైబ్రరీ ఉందని, ఎక్కువ శాతం నెట్ అర్హత పీహెచ్‌డీ కలిగిన అధ్యాపకులు ఉన్నారని తెలిపారు. 5జీ ఇంటర్‌నెట్ సౌకర్యాలు ఉన్నాయని, అన్ని రకాల విద్యా కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు.

తొలగించిన విద్యుత్ ఆపరేటర్లను తీసుకోవాలి



మాట్లాడుతున్న రాపర్తి రాజు

పాలకుర్తి టౌన్: విద్యుత్ సబ్ స్టేషన్లలో తాత్కాలికంగా పని చేస్తున్న విద్యుత్ ఆపరేటర్లను వెంటనే తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాపర్తి రాజు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని చిట్యాల ఐలమ్మ స్మారక భవనం ఆవరణలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. విద్యుత్ సబ్ స్టేషన్లు నిర్మిస్తున్న భూమి యజమాని కుటుంబంలో ఉద్యోగాలిప్పిస్తామని హామీ ఇచ్చి కేవలం ఆరు మాసాల వరకు మాత్రమే కొనసాగించి వారిని తొలగించారన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలోని కడవెండి, ఏడునూతుల, చర్లపాలెం, బొమ్మకల్, విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సిబ్బందిని తొలగించారని తెలిపారు. తొలగించిన సిబ్బందిని వెంటనే పని చేయిస్తానని మాజీ మంత్రి దయాకర్ రావు హామీ ఇచ్చారని అన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని చెప్పారు. దయాకర్‌రావు బాధ్యత వహించి సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా సమస్యను వెంకటనే పరిష్కరించే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో చిట్యాల సోమన్న, బత్తిని వెంకన్న, సబ్ స్టేషన్ ఆపరేటర్లు వెంకటమణ, యాకన్న, అమృతా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక డంపుల పరిశీలన

చిల్పూరు: మండలంలోని రాజవరం గ్రామ సమీపంలోని వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపులను గురువారం ఆర్‌ఐ కల్వల శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన రైతులు తీగల మహేందర్, జక్కుల రాజయ్య, నల్ల ఎల్లయ్య తహసీల్దార్ సరస్వతికి ఫిర్యాదు చేశారు. ఆమె ఆదేశాలతో గ్రామంలో తనిఖీలు చేయగా సాంబరాజు, హరీష్, అమరేందర్‌రెడ్డి, రాంగోపాల్, వేణుగోపాల్, శ్రీనివాస్‌రావు, వెంకటస్వామి, రమేష్, కనుకరాజులు ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను నిల్వ చేసినట్లు గుర్తించామన్నారు. విషయాన్ని తహసీల్దార్ దృష్టికి తీసుకవెళ్లనున్నట్లు తెలిపారు.

ఎన్‌సీసీకి విద్యార్థుల ఎంపిక



ఎన్‌సీసీకి ఎంపికైన విద్యార్థులతో ఎన్‌సీసీ, ఆర్మీ అధికారులు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఛాగల్లు జెడ్పీఎస్‌ఎస్ విద్యార్థులు 25 మంది ఎన్‌సీసీకి ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం జి.కొమురయ్య, ఎన్‌సీసీ అధికారి రుద్రారపు శాంతి, మాజీ ఎన్‌సీసీ అధికారి కొల్లూరు ప్రకాశం తెలిపారు. పాఠశాలలో గురువారం వారు విలేకర్లతో మాట్లాడుతూ వివరాలు తెలిపారు. పాఠశాలలో ఎన్‌సీసీ కేడెట్స్ ఎంపిక కార్యక్రమాన్ని చేపట్టారని, ప్రథమ సంవత్సరానికి 15 మంది బాలురు, 10 మంది బాలికలు ఎంపికైనట్లు తెలిపారు. 50 మంది విద్యార్థులు పాల్గొనగా విద్యార్థుల శారీరక అంశాలు, రాత పరీక్ష, మాట్లాడే నైపుణ్యాలు పరిశీలించి మొత్తం 25 మందిని ఎంపిక చేశారని, వీరికి రెండు సంవత్సరాల పాటు ఎన్‌సీసీ శిక్షణ ఉంటుందన్నారు. జిల్లాలో కేవలం ఛాగల్లు జెడ్పీఎస్‌ఎస్‌కు మాత్రమే ఎన్‌సీసీ అవకాశం ఉండటం విద్యార్థులకు ప్రయోజనకరమని, ఎన్‌సీసీలో ఉత్తమ ప్రతిభ చూపిన వారికి పాలిటెక్నిక్, టీఎస్‌ఆర్‌జేసీ, ఇంజనీరింగ్, మెడికల్ తదితర పోటీ పరీక్షల్లో ప్రత్యేక రిజర్వేషన్లు ఉంటాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్మీ అధికారులు చౌరాసియా, షబ్బీర్, ఉపాధ్యాయులు ఎ.అంజిరెడ్డి, రాజేంద్రప్రసాద్, పరమేశ్వరి, సుదర్శన్, దేవేందర్‌కౌర్, సాయికుమార్, రమేష్, కరమ్‌చంద్, వెంకటేష్ పాల్గొన్నారు.

సుధాకర్‌రావుకు ఘన నివాళి



కొడకండ్ల: నివాళులు అర్పించిన నాయకులు



పాలకుర్తిలో..

కొడకండ్ల: మండలంలో ఎనలేని అభివృద్ధి పనులు చేపట్టిన దివంగత మాజీ ఎమ్మెల్యే డాక్టర్ నెమరుగొమ్ముల సుధాకర్‌రావు మండల ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకొన్నాడని పలువురు నాయకులు అభిప్రాయం వ్యక్తం చేశారు. గురువారం మండలకేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో సుధాకర్‌రావు చిత్ర పటానికి బీఆర్‌ఎస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. మండల ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పాలకుర్తి: పాలకుర్తి మండల బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో డాక్టర్ సుధాకర్‌రావు చిత్ర పటానికి పూల మాల వేసి ఘన నివాళులర్పించారు. మండల పార్టీ అధ్యక్షుడు పసునూరి నవీన్, ఎంపీపీ నల్ల నాగిరెడ్డి, జెడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాస్‌రావు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ మదార్, మాజీ మార్కెట్ చైర్మన్ ముస్కు రాంబాబు, మాచర్ల ఎల్లయ్య పాల్గొన్నారు. నియోజకవర్గ ప్రజలకు సేవలందించిన డాక్టర్ ఎన్ సుధాకర్‌రావు సేవలు మరువలేనివని మాజీ మార్కెట్ చైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావు అన్నారు. కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, గిరగాని కుమార్ గౌడ్, జలగం కుమార్, బొబ్బాల రమణారెడ్డి, లోనె శ్రీనివాస్, పసుల వెంకటేశ్ ఉన్నారు. సుధాకర్‌రావు సేవలు ప్రజలు మరువలేనివని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దొంగరి మహేందర్ అన్నారు.

ఐలమ్మ స్ఫూర్తితో ఉద్యమించాలి



జనగామ రూరల్: బీజేపీ పాలిత ప్రాంతాల్లో గత పదేళ్లలో మహిళలపై అత్యాచారాలు, దాడులు పెరిగాయని, మహిళలకు సమానత్వం, రక్షణ లేకుండా పోయిందని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో జిల్లా కమిటీ సభ్యురాలు మచ్చ సంధ్య అధ్యక్షతన మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ మహిళలు వీర నారి చాకలి ఐలమ్మ స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా మహిళా విభాగం కన్వీనర్‌గా పల్లెర్ల లలితను ఎన్నుకున్నారు. బొట్ల శేఖర్, తూటి దేవదానం పాల్గొన్నారు

వ్యాపారి మృతికి సంతాపంగా దుకాణాల బంద్



నివాళులర్పిస్తున్న ముత్తిరెడ్డి

జనగామ: పట్టణానికి చెందిన ప్రముఖ ఐరన్ మర్చంట్ వ్యాపారి, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్, కురుమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చిన్న నరసింహులు (59) గుండె పోటుతో మృతిచెందాడు. సంతాప సూచకంగా గురువారం దుకాణాలను మూసి వేశారు. జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలు, వ్యాపారులకు సుపరిచితుడైన నర్సింహులు ఆకస్మిక మృతి ప్రతి ఒక్కరిని కంటతడి పెట్టించింది. బీఆర్‌ఎస్ పార్టీలో చురుకైన కార్యకర్తగా పని చేస్తూ, చాంబర్ ఆఫ్ కామర్స్, లయన్స్ క్లబ్, కురుమ సంఘ అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడ్డారు. సమాచారం అందుకున్న మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి చేరుకొని నర్సింహులు మృతదేహంపై పుష్పగుచ్ఛంతో నివాళులర్పించారు. ఆయన మృతి పట్ల ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోకల జమున, అడ్వకేట్ ఆలేటి సిద్ధిరాములు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పోకల లింగయ్య, 20వ వార్డు కౌన్సిలర్ జూకంటి లక్ష్మీశ్రీశైలం, ప్రముఖులు, వ్యాపారస్తులు సంతాపం వ్యక్తం చేశారు.

ఏఆర్ పీసీ మృతి



రాజు(ఫైల్)

జనగామ: కలెక్టరేట్‌లోని కలెక్టర్ నివాసం వద్ద గార్డు డ్యూటీ చేస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ విలసాగరం రాజు(45) గురువారం(అర్ధరాత్రి) మృతి చెందారు. ఉమ్మడి జిల్లాలోని ఆత్మకూరుకు చెందిన ఆయన ప్రస్తుతం వరంగల్ భద్రకాళీ ఆలయ పరిసర ప్రాంతాల్లో ఉంటున్నారు. గార్డు డ్యూటీ చేస్తున్న సందర్భంలో అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో గుండెపోటుకు గురి కాగా, వెంటనే హనుమకొండకు తరలిస్తుండగా.. మార్గమధ్యలో మృతిచెందారు.

సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని తానేదార్‌పల్లి గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేలా ప్రత్యేక చొరవతో పనిచేయాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు మంతెన ఇంద్రసేనారెడ్డి టీపీసీసీ కార్యదర్శి సింగపురం ఇందిరకు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గ్రామానికి చెందిన పార్టీ నాయకులతో కలసి ఇందిరకు వినతిపత్రాన్ని అందజేశారు. తానేదార్‌పల్లి చెరువులో నీటిని నింపి రైతులకు సాగునీరు అందించాలని, తానేదార్‌పల్లి మీదుగా తమ్మడపల్లి(జీ) వరకు రోడ్డు అభివృద్ధి, ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని, అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు తదితర సమస్యపై వినతిపత్రం ద్వారా ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు సానుకూలంగా స్పందిస్తూ త్వరితగతిన పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి, నాయకులు మంతెన రమేష్‌రెడ్డి, మాచర్ల ఉప్పలయ్య, మార్క రాజు, గడెం కొమురయ్య, ఎస్‌రెడ్డి లింగారెడ్డి, చుక్క రమేష్, హరీష్, అరుణ్‌కుమార్, భిక్షపతి, తిరుపతి, సత్తెయ్య, కిష్టయ్య, బాబు, మహిపాల్ అనీల్, రాంరెడ్డి, లక్ష్మణ్, శ్రీను, నవీన్, చిరంజీవి పాల్గొన్నారు.

'హామీలను అమలు చేస్తున్న ఎమ్మెల్యే'

బచ్చన్నపేట: నియోజకవర్గ ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అమలు చేస్తున్నారని మండలంలోని కేసిరెడ్డిపల్లి ఎంపీటీసీ కర్నాల వేణుగోపాల్ అన్నారు. గురువారం కేసిరెడ్డిపల్లి హమాలీలకు సంఘం రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. కాపర్తి హరిప్రసాద్, అంబదాస్, యాకంరెడ్డి, రిక్కల రాజు, యాదండ్ల భాస్కర్‌గౌడ్, గాలి తిరుపతి, సందీప్, సంతోష్, రమేష్, బాపురాజు, నరేష్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేటినుంచి గాలికుంటు నివారణ టీకాలు

బచ్చన్నపేట: మండలంలోని పలు గ్రామాలలో పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలను నేటి (శుక్రవారం) నుంచి వేయనున్నట్లు మండల పశువైద్యాధికారి గుర్రం రామారావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలోని పడమటికేశ్వాపూర్, బచ్చన్నపేట పశువైద్యశాలల ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో రెండు క్లస్టర్‌లుగా ఎఫ్‌ఎండీ , లంపీ స్కిన్ టీకాలను వేయనున్నట్లు చెప్పారు.

కలెక్టర్‌కు వినతి

జనగామ రూరల్: చౌడారంలోని రంగనాయకుల స్వామి దేవాలయం ఎండోమెంట్ భూమి గ్రామానికి చెందిన వ్యక్తి తన, ఇతర పేరుతో రెండు ఎకరాల భూమి ఆక్రమించుకున్నాడని గ్రామానికి చెందిన బీజేపీ నేత ముక్క స్వామి గురువారం కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్‌కు వినతిపత్రం అందజేశాడు. గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి పాదయాత్రగా కలెక్టరేట్‌కు చేరుకొని సమస్యను వివరించి వినతి పత్రం అందజేశారు.

నేత్రవైద్య శిబిరం

లింగాలఘణపురం: మండలంలోని సిరిపురంలో గార్లపాటి రాజుఅనూష కూతురు గీతిక జన్మదినోత్సవం సందర్భంగా గురువారం గ్రామంలో కార్పొరేట్ స్థాయిలో ఉచిత నేత్రవైద్య పరీక్షలు నిర్వహించారు. సుమారు 250 మందికి ఉచితంగా అద్దాలు, మందులు పంపిణీ చేశారు. పుట్టిన రోజు సందర్భంగా సామాజిక సేవా కార్యక్రమాలు చేసిన చిన్నారి తల్లిదండ్రులను, తాత,నానమ్మలు అయోధ్యనాగమణిని గ్రామస్తులు అభినందించారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

చిల్పూరు: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని హెచ్‌ఎం దాసి శ్రవణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం టెన్త్ విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ యూత్ మండల అధ్యక్షుడు నారగోని రవిచంద్ర సొంత ఖర్చులతో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను అందజేశారు. ఉపాధ్యాయులు, గాదె ప్రమోద్, శ్రీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా పోషణ మాసోత్సవాలు

జఫర్‌గఢ్: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని కోనాయిచలం, సాగరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలలో పోషణ మాసోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోషక విలువలపై తల్లులకు అవగాహన కల్పించారు. ప్రతీ ఒక్కరు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు గీతారాణి, ఉపేంద్ర, సునీత, నిర్మల, విజయరాణి, ఆశవర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు.

మండలంలో..

తరిగొప్పుల: మండలంలోని అంకుషాపూర్, బొంతగట్టునాగారం అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకు కూరలు, కూరగాయలు, చిరుధాన్యాలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు భాగ్యలక్ష్మి, వినోద, పుష్పలత మాట్లాడుతూ ఐఎఫ్‌ఏ మాత్రలు ఖచ్చితమైన సమయంలో తీసుకోవడంతో లోపపోషణకు గురికాకుండా తల్లీ, బిడ్డ క్షేమంగా, ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. రాణి, సిద్దులు, సీపీ నాగరాజు, ఆయా లక్ష్మి పాల్గొన్నారు.

'జనసేన' ఆవిర్భావ దినోత్సవం

స్టేషన్‌ఘన్‌పూర్: జనసేన పార్టీ 11వ ఆవిర్భావ దినోత్సవాన్ని డివిజన్ కేంద్రంలో గురువారం ఘనంగా నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గాదె పృథ్వీ స్థానిక పార్టీ కార్యాలయం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రజాక్, వినయ్, పవన్, సాయి, ప్రశాంత్, శివ తదితరులు పాల్గొన్నారు.